క్లుప్తంగా

రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి



విద్యాధరపురం(విజయవాడపశ్చిమ): స్థానిక 50వ డివిజన్, గొల్లపాలెంగట్టు కొండ ప్రాంతంలో నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పనులను త్వరగతిన పూర్తిచేయాలని సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు నగరపాలకసంస్థ అధికారులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం గొల్లపాలెంగట్టు కొండప్రాంతంలో ఆయన పర్యటించి అక్కడ జరుగుతున్న రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను ఆయన పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ కొండ ప్రాంతంలో చిన్నపాటి వర్షాలకే కొండచరియలు జారిపడి ప్రజలు ప్రమాదాల బారినపడుతుండేవారన్నారు. వారి ఇబ్బందుల దృష్ట్యా గొల్లపాలెంగట్టు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి కౌన్సిల్‌లో ప్రతిపాదనలు పెట్టడంతో రూ.11 లక్షలతో పనులు ప్రారంభించామని చెప్పారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను కోరారు. సీపీఎం నాయకులు రాజు, మహేష్, దుర్గారావు పాల్గొన్నారు.

భౌతిక శాస్త్రం పరీక్షపై విద్యార్థులకు సూచనలు



పాయకాపురం(విజయవాడరూరల్): పదో తరగతి కామన్ పరీక్షలు రాసే విద్యార్థులకు భౌతిక శాస్త్రంలో ఉత్తీర్ణత సాధించడానికి జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ సులభమైన నమూనాలను సూచించారు. పుచ్చలపల్లి సుందరయ్య మునిసిపల్ హైస్కూల్‌లో మంగళవారం భౌతికశాస్త్రానికి సంబంధించి కొన్ని ప్రయోగాలను ఉపయోగించి వాటి నమూనాలను విద్యార్థులకు వివరించారు. కంటి దృష్టి లోపాలైన దీర్ఘదృష్టి, హ్రస్వదృష్టి, నిరోధాల శ్రేణి, సమాంతర పద్ధతులు, సబ్బును ఉపయోగించి దుస్తులను శుభ్రపర్చడం, ఇనుము తుప్పు పట్టడం, ఆమ్ల, క్షారాల్లో కొన్ని బొమ్మలు, రసాయన సమీకరణాలను తుల్యం చేయడంపై దృష్టిపెడితే శులభంగా భౌతిక శాస్త్రంలో ఉత్తీర్ణత సాధించవచ్చని సూచించారు. ఈ హైస్కూల్ నుంచి 145 మంది విద్యార్థులు పదో తరగతి కామన్ పరీక్షలకు హాజరవుతున్నారని ఆయన పేర్కొన్నారు.

భద్రతా వారోత్సవాలు ప్రారంభం



ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో 54వ జాతీయ భద్రతా వారోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సంస్థ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు వారోత్సవాలను ప్రారంభించి మాట్లాడుతూ భద్రత సూచనలు పాటిస్తూ సంస్థ ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా పాటుపడాలన్నారు. పారిశ్రామిక రంగంలో 85 శాతం ప్రమాదాలు మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని చెప్పారు. కాంట్రాక్ట్ కార్మికులు పని చేసే ప్రదేశాల్లో పర్యవేక్షక ఇంజినీర్ల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. ఎస్ఈలు సాంబశివరావు, కేవీ నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, కర్మాగారాల మేనేజర్ శేషాద్రిశేఖర్, కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

జూపూడి(ఇబ్రహీంపట్నం): ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చని ఏడీసీపీ జి.రామకృష్ణ అన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిమ్రా డెంటల్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అతివేగం, అజాగ్రత్తగా వాహనాలు నడపడం ద్వారా ఎదుటి వారికి కూడా ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందన్నారు. డ్రైవింగ్‌లో మెలకువలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ ధరించి, రికార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నియమావళిని ఉల్లంఘిస్తే నూతన చట్టం మేరకు జరిమానాలు విధిస్తామని సీఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాహిత్య, ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు పాల్గొన్నారు.

126 మందికి కంటి వైద్య పరీక్షలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): స్థానిక రాణి గారితోట, 17వ డివిజన్‌లోని సుందరయ్య గ్రంథాలయం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో అమరావతి ఐ హాస్పిటల్ వైద్యులు పాల్గొని 126 మందికి నేత్ర పరీక్షలు చేశారు. అవసరమైన రోగులకు ఐ డ్రాప్స్, కళ్లజోళ్లు అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయం కమిటీ కన్వీనర్ ఎస్.హరినారాయణ మాట్లాడుతూ.. ప్రతి మంగళవారం గ్రంథాలయం ఆవరణంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు.

అనధికార పార్కింగ్‌తో అవస్థలు



బస్టాండ్‌లో అనధికారికంగా నిలిపిన వాహనాలు



సిటి టెర్మినల్‌లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

- పండిట్ నెహ్రూ బస్టేషన్‌లో ఇష్టారాజ్యంగా పార్కింగ్
- ప్లాట్‌ఫాంలపైకి ప్రైవేట్ వాహనాలు
- బస్సుల రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): పండిట్ నెహ్రూ బస్టేషన్‌లో ద్విచక్ర వాహనాల అనధికార పార్కింగ్‌తో ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బస్టేషన్ సమీపంలోని ప్లాట్‌ఫాంల వద్ద అడ్డుదిడ్డంగా వాహనాలను నిలుపుతున్నారు. బస్టేషన్ ఆవరణలో అధికారికంగా వాహనాలకు పార్కింగ్ సౌకర్యం ఉన్నా అక్కడ రుసుము చెల్లించాలనే నెపంతో చాలమంది బస్టేషన్ ప్లాట్‌ఫాంల వద్ద, సిటీ టెర్మినల్‌లో ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలిపి వెళ్లిపోతున్నారు. దీంతో బస్సుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆర్టీసీ డ్రైవర్లు వాపోతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆర్టీసీ సిబ్బంది చెబుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్‌లోకి ప్రైవేట్ వాహనాలు యథేచ్ఛగా వస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో బస్టాండ్‌లోకి వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా చాలా సమయం పడుతుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆటోవాలాల హవా..

సిటి టెర్మినల్, బస్టేషన్‌లోని పలు ప్లాట్ ఫాంల వద్దకు నేరుగా ఆటోలు రావడం, గంటల తరబడి నిలుపుతుండటంతో బస్సు డ్రైవర్లు తమ అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్‌లోని యారైవల్ బ్లాక్, డిపార్చర్ బ్లాక్‌లో నిత్యం నిలిపే ప్రైవేట్ కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు.

పార్కింగ్ ప్లేస్‌గా బస్టాండ్



ప్రైవేట్ వాహనాలతో బస్టాండ్ ఒక పార్కింగ్ ప్లేస్‌గా మారింది. ఎక్కడపడితే అక్కడ వాహనాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నారు. బస్టాండ్‌లోకి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం.

– శివారెడ్డి, ప్రయాణికుడు

పట్టించుకోని అధికారులు..

గతంలో ప్రైవేట్ వాహనాలు బస్టాండ్‌లోకి రాని వ్వకుండా అధికారలు చర్యలు తీసుకునే వారు. కానీ ప్రస్తుతం కొన్ని సందర్భాల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలు ఇష్టారాజ్యంగా వస్తున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు.

మైనార్టీలకు కూటమి సర్కార్ కుచ్చుటోపీ



వెలంపల్లిని సత్కరిస్తున్న ముస్లింలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తరువాత మైనార్టీలకు కుచ్చుటోపీ పెట్టిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాస రావు అన్నారు. రంజాన్ ఉపవాస దీక్షలు జరుగుతున్న సందర్భంగా వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్, ఆయన అనుచరులు వెలంపల్లి శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో కలిసి ఇస్లాం సంప్రదాయంలో సత్కరించారు. ఈ సందర్భంగా కూటమి సర్కార్ మైనార్టీలకు అన్యాయం చేస్తోందని వివరించారు. దీనిపై వెలంపల్లి స్పందిస్తూ.. అన్ని రంగాల్లో కూటమి సర్కార్ ఘోరంగా విఫలమైందన్నారు. అలాగే మైనార్టీల సంక్షేమంలోనూ మోసం చేసిందన్నారు. ఏ ఒక్క హామీని నిలబెట్టుకోవటంలేదని మండిపడ్డారు. అనేక పథకాలను కూటమి సర్కార్ అటకెక్కించిందన్నారు. అన్ని వర్గాలను మోసం చేసిందని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చారన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు షేక్ వాహెద్, ఎండీ యూనస్, ఎండీ ఇక్బాల్, ఎండీ నజీర్, షేక్ గౌసి, అంజుమన్ నాయకులు షేక్ సుభాని, షేక్ రసూల్, ఎండీ ఆరిఫ్, గాలిబ్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీసీ ఆపరేషన్లకు మెరుగైన సౌకర్యాలు

మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర



ఏబీసీ సెంటర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): యానిమల్ బర్త్ కంట్రోల్ ఆపరేషన్ల నిమిత్తం మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో గల ఏబీసీ ఆపరేషన్స్ సెంటర్, బయోమెథనైజేషన్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూగజీవాలకు చేసే బర్త్ కంట్రోల్ ఆపరేషన్లకు అవసరమైన సర్జికల్ పరికరాలను మరింత పెంచేందుకు కావల్సిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అదే ప్రాంతంలో ఉన్న బయోమెథనైజేషన్ ప్లాంట్‌ను పరిశీలించి కూరగాయల వ్యర్థాల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ ప్రక్రియను పరిశీలించారు. పర్యటనలో ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్(ప్రాజెక్ట్స్) పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, వెహికల్ డిపో ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏసుపాదం పాల్గొన్నారు.

కూటమి సర్కార్ పతనం ప్రారంభమైంది



మాట్లాడుతున్న ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పతనం ప్రారంభమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు షేక్ ఆసిఫ్ అన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఉత్తరాంధ్రలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు కూటమి బలపరిచిన అభ్యర్థికి తమ ఓటు ద్వారా వారి నిరసనలను తెలియజేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అనేక వాగ్దానాలను అమలు చేస్తామని నమ్మబలికిందన్నారు. ప్రధానంగా సూపర్ సిక్స్ పేరుతో అన్ని వర్గాల ప్రజలను మోసగించి ఎన్నికల్లో గెలిచిందని చెప్పారు. కానీ నేడు ఆర్థిక పరిస్థితి అంటూ చేతకాని మాటలు చెబుతుందన్నారు. గడిచిన ఏడాది ఆర్థిక సంవత్సరానికి అమ్మ ఒడితో పాటుగా అన్ని పథకాలను నిలిపివేసి వచ్చే ఏడాది నుంచి ఏవో ఇస్తామంటూ మళ్లీ అబద్ధాలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. అంతేకాకుండా బడ్జెట్‌లోనూ 18 సంవత్సరాలు నిండిన వారికి రూ.1500, 50 సంవత్సరాలు నిండిన మహిళలకు పెన్షన్ వంటి పథకాలకు సంబంధించిన ప్రస్తావన లేదన్నారు.

బాబు వ్యాఖ్యలు దుర్మార్గం..

రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో తప్పుడు కేసులు పెట్టి పోసాని మురళీకృష్ణ వంటి వ్యక్తులను తీవ్ర ఇబ్బందులకు గురి చేయటం దుర్మార్గమన్నారు. ప్రజలు గమనిస్తున్నారని, తగిన బుద్ధి చెప్పటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. 40 ఏళ్ల సీనియార్టీ ఉన్న నేతగా చెప్పుకునే చంద్రబాబు రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు, నేతలకు ఎటువంటి పనులు చేయవద్దంటూ చెప్పటం దుర్మార్గమన్నారు. ప్రాంతాలను చూడం, వర్గాలను చూడం, పార్టీలను చూడమని అర్హులైన వారందరికీ పథకాలు ఇస్తామని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డిని చూసి చంద్రబాబు సిగ్గు తెచ్చుకోవాలని హితవు పలికారు.

23న అమరావతి చిత్రకళావీధి

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక సమితి ఆధ్వర్యంలో యునైటెడ్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ సహకారంతో ఈ నెల 23వ తేదీన రాజమండ్రిలోని దామెర్ల ఆర్ట్స్ గ్యాలరీలో చిత్రకళావీధి పేరిట జాతీయ స్థాయి ప్రదర్శన జరుగుతుందని సృజనాత్మక సమితి సీఈఓ ఆర్.మల్లికార్జునరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఏడు నుంచి రాత్రి పది గంటల వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని పేర్కొన్నారు. దేశంలో వివిధ ప్రాంతాల చిత్రకారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో చిత్రకారులు తమ చిత్రాలను ప్రదర్శించి విక్రయించుకోవచ్చని సూచించారు. చిత్రకారులు రూ.1000 ప్రవేశ రుసుం చెల్లించి, amaravathiartfestival.com వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇలా వచ్చిన మొత్తాన్ని దామెర్ల ఆర్ట్ గ్యాలరీకి వినియోగిస్తామని ఆ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీ లోపు పేర్లు నమోదుచేసుకోవాలని పేర్కొన్నారు.

అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని వినతి



కృష్ణా యూనివర్సిటీ నూతన వీసీ రాంజీకి వినతి పత్రం అందజేస్తున్న అధ్యాపక సంఘం నేతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): గవర్నమెంట్ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం నాయకులు కృష్ణా యూనివర్సిటీ నూతన వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ రాంజీని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ పరిధిలో విద్యార్థులు, అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. వాటిని పరిష్కరించాలని విజ్ఞప్తిచేశారు. జిల్లాలో భారీగా పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా డిగ్రీ ద్వితీయ, ప్రథమ సంవత్సరం రెండు, నాలుగు సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్‌లోనే పూర్తి చేయాలని కోరారు. డిగ్రీ ఎగ్జామినేషన్ స్పాట్ వాల్యుయేషన్ రెమ్యూనరేషన్‌ను పెంచాలని, ఎండల తీవ్రత దృష్ట్యా ఏప్రిల్ 25 నుంచి జూన్ 13వ తేదీ వరకు వేసవి సెలవులను వరకు ప్రకటించాలని వినతి పత్రం అందజేశారు. వైస్ చాన్స్‌లర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రెటరీ ఎం.శ్యాంబాబు, ఎన్టీఆర్ జిల్లా గవర్నమెంట్ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం కార్యదర్శి డాక్టర్ జె.రాముడు, అధ్యక్షుడు డాక్టర్ కె.సుధాకరరావు, కృష్ణాజిల్లా కార్యదర్శి కె.ఆర్.మంజుల, అధ్యక్షులు పూజమురళి, యూనివర్సిటీ కార్యదర్శి డాక్టర్ ఎస్.కె బీబీ, డాక్టర్ సుధాకర్, ముప్ప పద్మనాభం, డాక్టర్ జాన్ సుకుమార్, డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు భద్రత

గుణదల(విజయవాడ తూర్పు): రోడ్డుపై ప్రయాణించే ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ ధరించడం ద్వారా వారి ప్రాణాలకు భద్రత లభిస్తుందని నాలుగో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఆదినారాయణ సూచించారు. రామవరప్పాడు రింగ్ రోడ్డు సమీపంలో మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు హెల్మెట్ వల్ల ఉపయోగాలను తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ.. జుట్టు చెదిరిపోతుందని, తలనొప్పి వస్తుందని కుంటి సాకులు చెబుతూ చాలా మంది వాహన చోదకులు హెల్మెట్లు ధరించడం లేదన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు. హెల్మెట్ ధారణ వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని వివరించారు. వాహనాల రికార్డుల కన్నా హెల్మెట్ ధారణే ముఖ్యమన్నారు. అందుకే న్యాయస్థానాలు సైతం హెల్మెట్ ధరించడం అనివార్యమని ప్రకటించాయని గుర్తు చేశారు. రాష్ట్ర హై కోర్టు ఆదేశాల మేరకు వాహన చోదకులు హెల్మెట్ వినియోగం తప్పనిసరని తెలిపారు. హెల్మెట్ ధరించని వాహన చోదకులపై తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం ప్రయాణికుల వద్ద ఉన్న రికార్డులను పరిశీలించారు. హెల్మెట్ వినియోగించని వారికి జరిమానా విధించారు. హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



సైకిల్ ర్యాలీ చేపట్టిన విద్యార్థినులతో ప్రశాంతి, అంగన్‌వాడీ కార్యకర్తలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థినుల శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలిగించే క్రీడలు జీవితంలో భాగం కావాలని ఐసీడీఎస్ విజయవాడ అర్బన్ ప్రాజెక్ట్ సెక్టార్–1 సూపర్‌వైజర్ జి.ప్రశాంతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం భవానీపురంలోని భాష్యం పాఠశాల విద్యార్థినులతో అవగాహన సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ.. అన్ని రంగాలలో రాణిస్తున్న మహిళలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అవకాశాలను అందిపుచ్చుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళల పట్ల వివక్ష చూపిన వారిని ప్రశ్నించి నిలదీయాలని పేర్కొన్నారు. సమాజంలో ధైర్యంగా నిలబడినప్పుడే అవతల వ్యక్తులు వెనక్కి తగ్గుతారని తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నిరోధకంపై అవగాహన



మంటలను ఆర్పే విధానాన్ని వివరిస్తున్న అధికారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వాటిని ఎలా నిరోధించాలి అన్న అంశంపై నగరపాలక సంస్థ ఫైర్ ఆఫీసర్స్ మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గంలోని వన్‌టౌన్ వస్త్రలత హోల్‌సేల్ మార్కెట్‌లో వ్యాపారులు, షాపుల్లో పని చేస్తున్న సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అగ్నిని నిరోధించే పరికరాలను ఉపయోగించే విధానం, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఆర్పేందుకు ఎటువంటి పరికరాలను ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్లు, స్మోక్ డిటెక్టర్స్ ఎక్కడెక్కడ అమర్చాలి వంటి విషయాలను వివరించారు. అదే విధంగా అగ్నిప్రమాదం జరగకుండా వస్త్రలత షాపుల సముదాయం చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేమి ఉండాలి అనే అంశాలను తెలియజేశారు. మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

డీ సిల్టింగ్ పనులను నిరంతరం చేపట్టాలి



డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): డ్రెయిన్లలో మురుగు నీరు సజావుగా ప్రవహించేందుకు నిరంతరం డీ సిల్టింగ్ పనులను చేపట్టాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన తన పర్యటనలో భాగంగా అధికారులతో కలిసి అజిత్‌సింగ్‌నగర్ డాబాకొట్ల సెంటర్‌లో జరుగుతున్న డీసిల్టింగ్ పనులను పరిశీలించారు. డ్రెయిన్లలో డీసిల్టింగ్ పనులు చేసేటప్పుడు అడ్డు వచ్చిన ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. పూర్తి స్థాయిలో డీసిల్టింగ్ పనులను చేసి వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పర్యటనలో పాత ఎస్టీపీను గమనించి దానిని పునరుద్ధరించి ప్రజలకు ఉపయోగపడేలా ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్(ప్రాజెక్ట్స్) పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబుశ్రీనివాస్, వెహికల్ డిపో ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పరిశీలన..

భవానీపురం(విజయవాడపశ్చిమ): అన్న క్యాంటీన్లకు వచ్చే ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన తన పర్యటనలో భాగంగా అజిత్‌సింగ్‌నగర్‌లోని అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. ఆహారం సరఫరా, నాణ్యత, సదుపాయాలపై అక్కడ ఉన్న ప్రజలతో మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. షెడ్డును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భోజనానికి వచ్చే ప్రజలకు ఇచ్చే టోకెన్లు, వసతులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. పర్యటనలో జోనల్ కమిషనర్ ప్రభుదాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముస్లింలకు వడ్డీలేని రుణాలు మంజూరు చేయాలి



షేక్ కబీర్‌కు నియామక పత్రం అందజేస్తున్న షేక్ నాగుల్ మీరా

పాయకాపురం(విజయవాడరూరల్): ముస్లింలకు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం మంజూరు చేయాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా డిమాండ్ చేశారు. కండ్రికలో 57వ డివిజన్ కమిటీ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ అధ్యక్షతన మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు నాగుల్ మీరా మాట్లాడుతూ.. రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ముస్లిం కుటుంబానికి మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలన్నారు. పేద ముస్లింలకు సేవ చేయాలనే సదుద్దేశం ఉన్న వారు ఆజాద్ ముస్లిం కమిటీలో సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కమిటీ చేస్తున్న సేవా కార్యక్రమాలను ముస్లింలకు వివరించి కమిటీలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం షేక్ కబీర్‌కు కమిటీ నగర కార్యదర్శిగా నియమించి నియామక పత్రం అందజేశారు. సహాయ కార్యదర్శి ఎండీ జానీ, కమిటీ ప్రతినిధులు చాంద్ బాషా పాల్గొన్నారు.

- **భవానీపురం(విజయవాడపశ్చిమ):** వన్‌టౌన్‌లోని అయాన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం విద్యాధరపురం మహ్మదాలీపురంలోని బాలికల ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు అయాన్ హాస్పిటల్ గౌరవ అధ్యక్షుడు వావిలాల రజనీకాంత శర్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వైద్యశిబిరం కొనసాగుతుందని చెప్పారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్జీఓ రాష్ట్ర మహిళా విభాగం ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో మహిళా ఉద్యోగులకు మంగళవారం క్రీడా పోటీలు నిర్వహించారు. టగ్ ఆఫ్ వార్, బ్యాడ్మింటన్, లెమన్ అండ్ స్పూన్ తదితర పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

– విజయవాడస్పోర్ట్స్



టగ్ ఆఫ్ వార్‌లో పోటాపోటీ



లెమన్ అండ్ స్పూన్‌లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు